సాక్షి
చిత్తూరు

గురువారం ׀ 13 ׀ ఫిబ్రవరి ׀ 2025



రియల్ ధమాల్!
కూటమి ప్రభుత్వం భూముల విలువ పెంపుతో రిజిస్ట్రేషన్ల ఆదాయం గణనీయంగా పడిపోయింది. - 8లో



పంటలపై గజరాజుల దాడులు
పెద్దపంజాణి మండలంలో ఏనుగులు పంట పొలాలపై బీభత్సం సృష్టించి పంటలను ధ్వంసం చేశాయి. - 8లో



మొగిలి ఘాట్‌లో కంటైనర్ బోల్తా
బంగారుపాళెం మండలంలోని మొగిలి ఘాట్‌లో ప్రమాదవశాత్తు అదుపు తప్పి కంటైనర్ బోల్తా పడింది. - 8లో

న్యూస్‌రీల్

బీసీ కార్పొరేషన్ రుణాలకు 15 వరకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అర్హత, ఆసక్తి ఉన్న వారు బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 15 వరకు అవకాశం కల్పించారని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న బీసీ కార్పొరేషన్ రుణాలను అర్హులకు అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. జిల్లాలో అర్హులైన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి యూనిట్ల రుణాలకు గడువు తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో వైద్య సిబ్బంది మెరిట్ జాబితా

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్ నోటిఫికేషన్‌కు సంబంధించిన ఫైనల్ మెరిట్ లిస్టును ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది మెడికల్ ఆఫీసర్, ఫిజీషియన్, ఆడియాలజిస్ట్, స్టాఫ్‌నర్స్, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఆప్టోమెట్రిస్ట్, డెంటిస్ట్ తదితర పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. ఆ మేరకు దరఖాస్తుల అభ్యంతరాల స్వీకరణ పూర్తి ఫైనల్ మెరిట్ లిస్టును ఆన్‌లైన్‌లో పొందుపరిచామని, ఈ జాబితా కోసం www.chittoor.ap.gov.in ను చూడవచ్చునని పేర్కొన్నారు.

కట్టమంచి హెచ్‌ఎంకు చార్జి మెమో

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని కట్టమంచి నగరపాలక హైస్కూల్ హెచ్‌ఎం రమాదేవికి చార్జి మెమో జారీ చేశారు. ఈ మేరకు వైఎస్సార్ కడప జిల్లా పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఆ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సోషల్ టీచర్ ధనశేఖర్ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించి సస్పెండ్ అయిన విషయం విదితమే. అదే విధంగా ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ భువనేశ్వరి, హిందీ టీచర్ జ్యోతీశ్వరి, గణిత ఉపాధ్యాయుడు మనోహర్ విధుల పట్ల అలసత్వం వహించడంతో వారికి సైతం ఇటీవల డీఈఓ చార్జీ మెమోలు జారీ చేశారు. ఈ ఘటనలో పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న భువనేశ్వరి పర్యవేక్షణ లోపం కారణంగా చార్జి మెమో జారీ చేశారు. ఏడు రోజుల లోపు ఆర్జేడీకి లిఖిత పూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని పేర్కొన్నారు. హెచ్‌ఎం ఇచ్చే సంజాయిషీ సంతృప్తి కరంగా లేకపోతే సస్పెండ్ చేసే అవకాశాలున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

ఇసుకాసురులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఆ పార్టీలోని ఇసుకాసురులు బరితెగించారు. ఉచిత ఇసుక పథకం కూటమి నేతలకు వరంగా మారింది. నగరి కుశస్థలి నది నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా రవాణా చేస్తూ ఉచితం పేరుతో ఇసుకను ఊడ్చేస్తున్నారు. వాల్టా చట్టాన్ని ఉచిత ఇసుక ముసుగులో బోల్తా కొట్టిస్తున్నారు. ఇసుకాసురుల ఆగడాలతో నది గట్టుకు కాల కృత్యాలకు వెళ్లే మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. దీంతో గ్రామస్తులు కన్నెర్ర చేశారు. రోడ్డెక్కి రాస్తారోకో చేస్తూ సమస్య పరిష్కారం అయ్యే దాకా లేవమంటూ భీష్మించుకూర్చున్నారు.



- కుశస్థలిని కుళ్లబొడిచేస్తున్నారు
- ఉచితమని ఊడ్చేస్తున్నారు
- అడ్డుపడితే బెదిరింపులు, దాడులు
- ఇసుక అక్రమార్కుల ఆగడాలు
- ఇసుక అక్రమ రవాణాపై గ్రామస్తుల కన్నెర్ర
- రోడెక్కి రాస్తారోకో, ధర్నా చేసిన స్థానికులు




ట్రాక్టర్లు వచ్చే మార్గంలో రోడ్డుపై ఇసుక

నగరి : కూటమి పాలన వచ్చినప్పటి నుంచి ఇసుకపైనే ఆ పార్టీ నేతలు ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఇసుక దోపిడీకి లైసెన్స్ ఇచ్చినట్లు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు. ఉచిత ఇసుక పేరుతో కుశస్థలి నదిని కుళ్లబొడిచేస్తున్నారు. సత్రవాడ ప్రాంతంలో రాత్రి, పగలు తేడా తెలియకుండా ఇసుకను దోచేస్తుండటం, ఉదయాన్నే కుశస్థలి నది గట్టుపైకి కాల కృత్యాలకు వెళ్లే మహిళలపై ఇసుక తరలింపుదారులు అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో మున్సిపల్ పరిధి సత్రవాడ, వినాయకపురం గ్రామస్థులు తీవ్ర ఆగ్రహంతో రోడ్డెక్కారు. ఇసుక తరలింపుదారుల ఆగడాలు తట్టుకోలేకపోతున్నామంటూ ట్రాక్టర్లు ప్రయాణించే దారిలో రాస్తారోకో చేశారు. అనంతరం సచివాయం ఎదురుగా రోడ్డుపై కూర్చొని ఆందోళన చేపట్టారు. ఇసుక తరలింపునకు అడ్డుకట్ట వేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. వేలా పాలా లేకుండా రాత్రింభవళ్లు ఇసుక తరలింపు జరుగుతోందన్నారు. ప్రభుత్వం అవసరాలకు ఇసుక ఉచితం అంటే దాన్ని వ్యాపారంగా మార్చేసి తరలించేస్తున్నారన్నారు. వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కేశారని వాపోయారు. వంతెన సమీపంలో విచ్చల విడిగా ఇసుకను అక్రమంగా తరలించి లక్షలు ఆర్జిస్తున్నారని తెలిపారు. నది నుంచి ఇసుక తరలించే మార్గం అధ్వానంగా తయారైందన్నారు. ఆ దారిలో వాహనాల్లో వెళ్లేవారు అదుపు తప్పి పడిపోతున్నారన్నారు. మితి మీరిన వేగంతో ట్రాక్టర్లు వెళుతున్నాయని పిల్లలను బయటకు పంపడానికి భయమేసే పరిస్థితులు దాపురించాయన్నారు. మహిళలు వేకువ జామున కాలకృత్యాలకు నది గట్టుకు వెళితే ఇసుక తరలింపుదారులు సెల్‌ఫోన్ల ద్వారా ఫొటోలు, వీడియోలు తీస్తున్నారని మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. గట్టుపై గుంపుగా కూర్చొనిమద్యం తాగుతూ అటువైపు వచ్చే ఆడ పిల్లలను వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రశ్నిస్తే దుర్భాషలాడుతూ.. భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారని వాపోయారు. ఈ సమస్యలకు ముగింపు పలికే దాకా ధర్నా విరమించమంటూ భీష్మించు కూర్చున్నారు. ఇంతగా ధర్నా చేస్తున్నా ఉన్నతాధికారులైన ఆర్డీవో, డీఎస్పీ ఎందుకు ఇక్కడికి రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సమాచారం అందుకున్న పోలీసులు ధర్నా జరిగే ప్రాంతానికి చేరుకొని నిరసన కారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే వారి ప్రయత్నాలు ఫలించలేదు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని వారు పట్టు బట్టారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ నిరసన కారులతో చర్చించారు. ఇకపై ఈ ప్రాంతం నుంచి ఇసుక తరలింపు జరగదని పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో నిరసన కారులు రోడ్డుపై నుంచి లేచారు.


దారులు లేకుండా గ్రామస్తులు తవ్విన గొయ్యి.. చదును చేసిన దృశ్యం


ఇసుక ట్రాక్టర్లు వచ్చే మార్గంలో మహిళల నిరసన


నిరసనతో రోడ్డుపై నిలిచిన వాహనాలు

ఆడపిల్లలపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు



ఆడ పిల్లలను ఏటి గట్టుకు తీసుకుపోలేని పరిస్థితి నెలకొంది. గట్టుపై మద్యం తాగుతూ వచ్చిపోయే వారిని దుర్భాషలాడుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. వారి కంటబడకుండా తెల్లవారుజామున 3 గంటలకో, 4 గంటలకో వెళ్లివస్తామనుకుంటే అక్కడే మకాం వేస్తున్నారు. చెప్పుకోలేని ఇబ్బందులతో సతమతం అవుతున్నాం.

– సరస్వతీ, వినాయకపురం

కాలు విరగడంతో ఆస్పత్రిలో చేర్పించాం



నీటిలో ఇసుక తీసేస్తుండడంతో నీటిలో నడుస్తూ గట్టుకు వచ్చేవారికి గుంతలు కనిపించక అకస్మాత్తుగా లోపలికి దిగపడిపోతున్నారు. ఒక మహిళకు ఈ కారణంగా కాలు విరిగితే ఆస్పత్రిలో చేర్పించాం. ఈ విషయమై ప్రశ్నిస్తే కొట్టడానికి వస్తున్నారు. ఇసుక తరలింపు ఆపితేనే మాకు ప్రశాంతత.

– కుప్పమ్మ, వినాయకపురం.

ప్రశ్నిస్తే బెదిరింపులు



వయసులో ఉన్న ఆడ పిల్లలు నది గట్టుకు వెళ్లలేని పరిస్థితి. ఇసుక తరలింపుదారులు గోడలపై నిలబడి వీడియోలు, ఫొటోలు తీస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే నీ పని చూసుకొని వెళ్ల లేకుంటే ట్రాక్టర్ పైకి ఎక్కించేస్తాం, కాలు విరిచేస్తాం అంటూ బెదిరిస్తున్నారు. వీధుల్లో వేగంగా ట్రాక్టర్లు వెళుతున్నాయి. పిల్లల్ని వీధిలోకి పంపాలంటేనే భయమేస్తోంది.

– కన్నెమ్మ, వినాయకపురం.

ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు



ఇక్కడ మహిళలకు కాలకృత్యాలకు ఏటి గట్టుకు వెళ్లడం అలవాటు. అయితే ప్రస్తుతం రాత్రింబవళ్లు ఇసుక ట్రాక్టర్లతో నది హడావుడిగా ఉంటోంది. మరుగుగా వెళ్లే ఆడ పిల్లలను కొందరు ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు. పలువురికి ఈ పరిస్థితి ఎదురవడంతో గ్రామమంతా రోడ్డుపైకి వచ్చేసింది. ఏటి గట్టంతా మందు బాటిళ్లే ఉన్నాయి.

–శ్రీనివాసన్, సత్రవాడ

అసంఘటిత కార్మికులకు సంక్షేమం

- ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదుకు అవకాశం
- సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడి



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అసంఘటిత కార్మికులకు సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల వివరాలను ఈ–శ్రమ్ పోర్టల్ లో ఉచితంగా నమోదు చేయాలన్నారు. ఈ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. అసంఘటిత, వలస కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు సామాజిక భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం ఈశ్రమ్ పోర్టల్‌లో వివరాలు సేకరిస్తోందన్నారు. ఉచిత నమోదు, గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలన్నారు. 16 నుంచి 59 సంవత్సరాల వయసు లోపు, ఆదాయ పన్ను చెల్లించని, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం లేని వారు ఈ–శ్రమ్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలలో పనిచేసే సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయ కూలీలు, చేనేత కార్మికులు, ఉపాధి కూలీలు ఇలా వివిధ రంగాలలో అసంఘటిత కార్మికులు ఈ శ్రమ్ ను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. మండల, గ్రామ స్థాయిలోని అధికారులతో సమన్వయం చేసుకుని నమోదు ప్రక్రియను వేగవంతం చేయలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఓంకార్, డ్వామా పీడీ రవికుమార్, బిసి కార్పొరేషన్ ఏడీ శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య పాల్గొన్నారు.

ఇరువర్గాల క్షేమానికే లోక్ అదాలత్

- మార్చి 8న అదాలత్
- లీగల్ సర్వీసస్ అథారిటీ చైర్మన్ భారతి


సమావేశంలో ప్రసంగిస్తున్న చైర్మన్ భారతి.. చిత్రంలో న్యాయమూర్తులు ఆరీఫాషేక్, కృష్ణవంశీ

పుంగనూరు : సమాజంలోని రెండు వర్గాల విభేదాలను పక్కన పెట్టి క్షేమంగా ఇరువురు కలిసి ఉండేందుకు లోక్ అదాలత్‌ను వేదికగా మార్చుకోవాలని జిల్లా లీగల్ సర్వీసస్ అథారిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి భారతి పేర్కొన్నారు. బుధవారం కోర్టు ఆవరణంలో స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫాషేక్, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణవంశీతో కలసి న్యాయవాదులు, పోలీసులు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ భారతి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా పెండింగ్ కేసులను తగ్గించేందుకు న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి , అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. కేసుల పరిష్కారంలో ప్రతి ఒక్కరు ఒక అడుగు తగ్గి మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పట్టింపులకు వెళ్తే సమస్యలు తీవ్రమై కాలయాపనతో పాటు అధిక వ్యయం అవుతుందన్నారు. వీటికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర లీగల్ సర్వీసస్ అథారిటీ లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసి, అన్ని రకాల కేసుల పరిష్కార వేదికగా ఏర్పాటు చేసిందన్నారు. ఇలాంటి వాటిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులపై అప్పీల్ ఉండదని, ఇందుకు సంబంధించిన కేసులకు కోర్టు ఫీజు వెనక్కి ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మార్చి 8న జరిగే లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కరించేందుకు కృషి చేసి, విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు, సీఐ శ్రీనివాసులు, న్యాయవాదులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ.. భయపడొద్దు!

బర్డ్‌ఫ్లూ సెగ జిల్లాకు పాకింది. ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు అప్రమత్తం చేస్తుండడంపై ప్రజలంతా వణికిపోతున్నారు. ఫలితంగా చికెన్ ధరలు అమాంతం దిగొచ్చాయి. దీనికి వాతావరణ పరిస్థితులు తోడు కావడంతో ఒక్కసారిగా పౌల్ట్రీ పరిశ్రమ కుదేలవుతోంది. మరోవైపు గుడ్ల ధరల సైతం నేలచూపులు చూస్తుండడంతో యాజమాన్యాలను ఆందోళన కలిగిస్తున్నాయి. పశుసంవర్థక శాఖ అధికారులు మాత్రం జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ కేసులు నమోదు కాలేదని, భయపడొద్దని సూచిస్తున్నారు.

- తగ్గిన చికెన్ ధరలు
- ప్రస్తుతం కిలో చికెన్ రూ.180
- గుడ్డు రూ.6కు పడిపోయిన వైనం
- ముక్క ముట్టేందుకు భయపడుతున్న జనం
- ఆందోళన వద్దని సూచిస్తున్న అధికారులు



చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఫీవర్ పట్టుకుంది. గోదావరి జిల్లాల్లో భారీ సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రభావం జిల్లాను తాకింది. దీంతో జిల్లా ప్రజానీకం, పౌల్ట్రీ యాజమాన్యాలు వణుకుతున్నాయి. ఇప్పటికే చికెన్ ధరలు పడిపోయాయి. ముక్క ముట్టేందుకు చికెన్ ప్రియులు భయపడుతున్నారు. పశుసంవర్ధశాఖ అధికారులు భయపడొద్దని సూచిస్తున్నారు.

జిల్లాలో సరఫరా ఇలా..

జిల్లాలో 8 వేల కుటుంబాలు కోళ్ల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. అలాగే 25 వేల కుటుంబాలకు ఉపాధి లభిస్తోంది. ఈ ఫారాల్లో నెలకు 75 లక్షల నుంచి 80 లక్షల వరకు బ్రాయిలర్స్ , 3 లక్షలు నాటు కోళ్లు, 45 లక్షల లేయర్స్ కోళ్లు, లింగాపురం 1.10 లక్షల వరకు పెంపకం సాగుతోంది. రోజువారీగా బ్రాయిలర్స్ 2 లక్షల కోళ్లు కడప, చెన్నై, అనంతపురం, కర్ణాటక సరఫరా అవుతున్నాయి. మరో 60 వేల కోళ్లు జిల్లా నలుమూలలకు రావాణా అవుతున్నట్లు ఫ్రౌల్టీ రంగం లెక్కలు చెబుతోంది. ఇందులో 5 శాతం మరణాలుంటాయని అంటున్నాయి. కొన్ని రోజులకు ముందు చికెన్ రూ. 260 వరకు పలికింది. ప్రస్తుతం చికెన్ ధర రూ. 180కు దిగజారింది. పడిపోయిన ధరలతో లైవ్ కోడి ధర రూ. 75కు పలుకుతోంది. ఈ ధరతో గిట్టుబాటు కాదని, లైవ్ రూ.95కు విక్రయిస్తేనే గిట్టుబాటు ఉంటుందని పెంపకందారులు వాపోతున్నారు. దీనికి తోడు కోడిగుడ్లు సుమారు 25 లక్షల నుంచి 30 లక్షల వరకు విక్రయాలవుతున్నాయి. ప్రస్తుతం ఈ ధర మార్కెట్లో రూ.6కు పడిపోయింది.

గోదారి జిల్లా ఎఫెక్ట్..

ఉభయ గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ విజృంభించింది. అక్కడ వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఆయా ప్రాంతాలకు చెందిన కోళ్లు, కోడిగుడ్లు ఈ ప్రాంతానికి రవాణా అయితే వాటి ద్వారా వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం అధికంగా ఉంది. అక్కడి నుంచి దిగుమతి అయిన కోళ్లు, కోడి గుడ్లు ఆహారంగా తీసుకుంటే ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. కోళ్ల మేత, రవాణా వాహనాల ద్వారా, కొంగలు, ఇతర పక్షుల జాతులు వలస రావడంతోనూ ఫ్లూ విజృంభించే అవకాశం ఉంటుందని జిల్లా వాసులు వణుకుతున్నారు. దీని కారణంగా జిల్లాలో చికెన్ వ్యాపారం ఢల్ అయింది. ఇక జిల్లా నుంచి కుంభమేళాకు వెళ్లే వారి సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో చికెన్ తినే వారి సంఖ్య తగ్గుముఖం పట్టింది. దీనికి తోడు ఎండ తీవ్రత అధికమైంది. ఈ ప్రభావంతో కోళ్ల పెంపకం తగ్గుతూ వస్తోంది. కోళ్ల సరఫరా తగ్గుముఖం పట్టాయి. చికెన్ షాపులు వెలవెల బోతున్నాయి. బిర్యానీ తినే వారి సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఈ ఎఫెక్ట్ పూర్తిగా కోళ్ల పరిశ్రమ పడింది.

ఇతర జిల్లాల నుంచి రాకుండా

రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తితో జిల్లాలోని కోళ్ల పరిశ్రమదారులు అప్రమత్తమయ్యారు. కోళ్ల సంరక్షణపై మరింత దృష్టి సారించారు. పరిసర ప్రాంతాల్లో ఎలాంటి పక్షులు వాలకుండా చూసుకుంటున్నారు. చిన్న జబ్బు పడిన అప్పుడే వైద్యులకు సమాచారం అందిస్తున్నారు. కోళ్లు చనిపోతే అవి ఏ జబ్బుతో చనిపోయిందో డాక్టర్లను అడిగి తెలుసుకుంటున్నారు. సరఫరా విషయంలో మరింత జాగ్రత్త పడుతున్నారు. అప్రమత్తంగా వ్యవహరిస్తూ కోళ్ల పరిశ్రమను కాపాడుకునే ప్రయత్నంలో పడ్డారు. ఈ ఎండ తీవ్రత పరిశ్రమను మరింత కష్టాల్లోకి తీసుకెళ్లవచ్చునని వ్యాపారులు ఢీలాపడుతున్నారు. పశుసంవర్ధశాఖ అధికారులు ఇతర జిల్లాల నుంచి కోళ్ల రవాణాను నివారించేందుకు చెక్‌పోస్టు సిబ్బందిని అప్రమత్తం చేశారు.

లక్షణాలు ఇలా.



బర్డ్‌ఫ్లూ లక్షణాలు సాధారణ ఫ్లూ లక్షణాలను పోలి ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఇన్ఫెక్షన్ సోకిన వ్యక్తులు దగ్గు, విరేచనాలు, జ్వరంతో పాటు శ్వాసకోశ ఇబ్బందులు, తలనొప్పి, కండరాల నొప్పి, ముక్కు కారటం, గొంతునొప్పి కూడా అనిపించవచ్చు. బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఉన్నవారిని వేరే గదిలో ఉంచడం మంచిది. లేకపోతే మరొకరికి సోకే ప్రమాదం ఉంది. ఇలాంటప్పుడు వైద్యుల సలహాలు తీసుకుని తగిన మందులు వాడాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కాగా ఇంతవరకు జిల్లాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవని చెబుతున్నారు. ప్రజలు భయదాల్సిన పనిలేదని పశుసంవర్ధకశాఖ అధికారులు ఒక ప్రకటనను విడుదల చేశారు.

పూర్తి స్థాయిలో నిఘా ఉంచాం



జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు నమోదు కాలేదు. అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలకు ఉపక్రమించాం. పూర్తి స్థాయిలో నిఘా ఉంచుతున్నాం. పౌల్ట్రీ యజమానులకు శానిటేషన్, రక్షణ చర్యలపై సూచనలు ఇచ్చాం. పక్షుల ద్వారా వ్యాప్తికి ఆస్కారం అధికంగా ఉంది. కోళ్ల ఫారాల వద్ద పక్షుల సంచారం లేకుండా చర్యలు చేపట్టాలి.అపోహలకు ప్రజలు భయపడాల్సిన పనిలేదు. కోడి గుడ్లు, మాంసంను బాగా ఉడికించి తినాలి.

– ప్రభాకర్, జేడీ, పశుసంవర్ధకశాఖ, చిత్తూరు

సంరక్షణలో జాగ్రత్తలు పాటిస్తున్నాం



జిల్లాలో కోళ్ల పెంపకందారులు కోళ్లను జాగ్రత్తగా పెంచుతున్నారు. ఏ చిన్న జబ్బు పడినా కోళ్ల డాక్టర్‌ను పిలిచి వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. జిల్లాలో ఇంత వరకు ఎప్పుడు బ్లర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించలేదు. ఇప్పుడు మరింత జాగ్రత్త పడుతున్నాం. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా పరిశ్రమ వ్యవహరించదు. ఇప్పటికే కోళ్ల పరిశ్రమ దెబ్బ పడింది. ఎండల తీవ్రతతో మరింత నష్టం కలగనుంది.

-వెంకటరెడ్డి, జీఎం , ప్రీమియమ్ చిక్ ఫీడ్స్ లిమిటెడ్, చిత్తూరు

క్లుప్తంగా

బోయకొండలో లక్ష కుంకుమార్చన

19 నుంచి మూడు రోజులు నిర్వహణ



బోయకొండ ఆలయ ముఖచిత్రం

చౌడేపల్లె : పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం తెలిపారు. మాఘ మాసంలో భక్తి శ్రద్ధలతో దంపతులు కలిసి అమ్మవారి సన్నిధిలో లక్ష నామ గలార్చనతో అభిషేక పూజల్లో పాల్గొంటే నిత్య సౌభాగ్యంతో పాటు అష్టైశ్వర్యములు కలుగుతాయన్నారు. ఆలయంలో ఏటా మాఘ మాసంలో లక్ష నామ మంత్రంతో ఈ కార్యక్రమం నిర్వహించడం సంప్రదాయంగా చేపడుతున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు ఆలయ నిర్వాహకులను సంప్రదించాల్సిందిగా కోరారు.

పంటలపై గజరాజుల దాడులు

పెద్దపంజాణి : మండలంలో సాగు చేసిన పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొంత కాలంగా పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాలైన తిప్పిరెడ్డిపల్లి, కొత్తబూరగపల్లి, పెనుగొలకల, పెద్దకాప్పల్లి, ముదిరెడ్డిపల్లి, బందార్లపల్లి, జిట్టంవారిపల్లి, గౌరీనగర్, ఆకులవారిపల్లి రైతులకు చెందిన పంటలను నాశనం చేస్తున్నాయి. మంగళవారం రాత్రి పుంగనూరు రేంజ్ పేటూరు ఫారెస్టు బీట్ నుంచి వచ్చిన ఏనుగులు కొత్తబూరగపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య, వెంకట్రామయ్య, పెనుగొలకలకు చెందిన ఈశ్వరమ్మ తదితరుల వరి పొలాలను ధ్వంసం చేశాయి. బుధవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలను చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఏనుగుల దాడుల్లో దెబ్బతిన్న పంటలను బుధవారం రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు వివరించి నష్ట పరిహారం మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రియల్ ధమాల్



- నగరంలో ఓ వ్యక్తి ఇటీవల ఒక ప్లాట్ కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. అయితే రిజిస్ట్రేషన్ చార్జీలు చూసి భయపడి ప్రస్తుతానికి అగ్రిమెంటు మీదే ఉంటా, తర్వాత చూసుకుందాంలే అంటూ వెనక్కు వచ్చారు.
- జీడీ నెల్లూరుకు చెందిన ఒకరు ఫిబ్రవరి 3న ఇల్లు కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్‌కు వెళ్లగా రూ.4 లక్షల మేర ఖర్చయింది. గతంలో ఎన్నడూ ఇంతలా చార్జీలు లేవని ఆవేదన చెందారు. అన్ని రంగాల పై ఇలా పన్నులు పెంచుకుంటూ పోతే బతికేది ఎలా అని వాపోయారు.

- రిజిస్ట్రేషన్ల ఆదాయం రివర్స్
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం
- ఇప్పటికి 64 శాతమే వసూళ్లు
- భూముల విలువ పెంపుతో కుదేలు
- లావాదేవీలకు ముందుకురాని వైనం

చిత్తూరు కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేసింది అంటూ పదే పదే కూటమి నేతలు చెబుతున్న మాటలు... ప్రస్తుతం కూటమి సర్కారు పాలనలో ఆదాయం రివర్స్ అయింది. గతంలో ఏటా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా భారీగా ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది. అలాంటిది పలు కారణాలతో స్థిరాస్తి రంగం కుదేలైంది. దీనికి తోడు ఈనెల 1 నుంచి భూముల విలువ పెంచడంతో రిజిస్ట్రేషన్లు పూర్తిగా పడిపోయాయి. ఈ ఏడాది లక్ష్యంలో ఫిబ్రవరి 11 వరకు 64 శాతం మాత్రమే చేరుకుంది.

గత వైఎస్సార్ సీపీ సర్కారు హయాంలో అమ్మకాలు, కొనుగోళ్లతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిటలాడేవి. ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. సాధారణంగా ఇళ్ల స్థలాలు, నివాసాలు, అపార్ట్‌మెంట్స్ రిజిస్ట్రేషన్ ద్వారానే సర్కారుకు ఎక్కువ ఆదాయం వస్తుంది. మొత్తం విలువలో స్టాంపు డ్యూటీ కింద 6.5 శాతం, రిజిస్ట్రేషన్‌కు 1 శాతంతో కలిపి మొత్తం 7.5 శాతం వస్తుంది. ఉదాహరణకు రూ.50 లక్షల ప్లాట్ అమ్మితే రూ.3.75 లక్షల వరకూ ప్రభుత్వానికి అందుతుంది. రిజిస్ట్రేషన్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఆదాయం పూర్తిగా పడిపోయింది. వెంచర్లు వేసే నాథుడే కానరావడం లేదు. రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసే వారిని, బిల్డర్లను బెదిరిస్తుండటంతో ఎవరూ ముందుకు రావడం లేదు. పెరిగిన రిజిస్ట్రేషన్ చార్జీలతో ఆదాయం పూర్తిగా పడిపోయింది.

అంతంత మాత్రమే ఆదాయం

2024–25 సంవత్సరానికి సంబంధించి జిల్లాకు రూ.221.88 కోట్లు ఆదాయం సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. కాగా ఫిబ్రవరి నెల 11 వరకు 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మొత్తం 50,294 డ్యాకుమెంటేషన్లు జరిగాయి. వీటి ద్వారా రూ.142.6 కోట్ల ఆర్జనతో 64 శాతం లక్ష్యాన్ని మాత్రమే చేరుకున్నారు. ఇందులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా పరిశీలిస్తే పలమనేరు 75 శాతం, కార్వేటినగరం 71, చిత్తూరు రూరల్ 70, చిత్తూరు అర్బన్ 70 శాతాలు వసూలు అయింది. పుంగనూరు 55, బంగారుపాళ్యం 56, కుప్పం 64, నగరి 64 శాతమే ఆర్జించాయి.



ఖాళీగా నగర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

ఇప్పటి వరకు వసూళ్లు 64 శాతం మాత్రమే

రిజిస్ట్రేషన్ కార్యాలయాలు	లక్ష్యం	రాబడి ఫిబ్రవరి 11 వరకు (రూ.కోట్లలో..)
చిత్తూరు నగరం	75.77	49.2
చిత్తూరు రూరల్	16.08	10
బంగారుపాళ్యం	11.73	6.56
కుప్పం	25.69	16.46
పుంగనూరు	33.78	18.20
కార్వేటినగరం	9.70	6.81
నగరి	16.33	10.55
పలమనేరు	32.8	24.82
మొత్తం	221.88	142.6

తహసీల్దార్లు పనితీరు

మార్చుకోవాలి

- టెలీకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ విద్యాధరి హెచ్చరిక



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని తహసీల్దార్లు పనితీరు మార్చుకుని ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం జిల్లాలోని తహసీల్దార్‌లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో నమోదైన అర్జీలను సత్వరం పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలకు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు జిల్లా, డివిజన్ కార్యాలయాలకు వస్తున్నారన్నారు. తహసీల్దార్‌లు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించకపోవడంవల్లే అర్జీదారుల సంఖ్య పెరుగుతోందన్నారు. రీ సర్వేకి సంబంధించి జాయింట్ ఎల్‌పీఎం సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరితిగతిన పరిష్కరించాలన్నారు. తహసీల్దార్‌లు నిబద్ధతతో ప్రజలకు సేవ చేయాలని జేసీ సూచించారు.

రేపు ఉద్యోగమేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్ వద్ద ఉన్న ఉపాధి కార్యాలయంలో ఈనెల 14న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి పద్మజ తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ మేళాలో 3 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయన్నారు. జిల్లాలో 18 నుంచి 35 సంవత్సరాల్లోపు పది నుంచి డిగ్రీ వరకు చదివిన అభ్యర్థులు ఉద్యోగ మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. ఎంపికయ్యే అభ్యర్థులకు కనీస వేతనం రూ.10 వేల నుంచి రూ.19 వేల వరకు ఉంటుందని వెల్లడించారు.

లోకాయుక్త ఫిర్యాదుపై విచారణ



బాధితులతో చర్చిస్తున్న ఆర్డీఓ భవాని

వి.కోట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు భూములు ఇచ్చిన బాధితుల ఫిర్యాదుపై బుధవారం పలమనేరు ఆర్డీఓ భవాని విచారణ చేపట్టారు. స్థానిక జూనియర్ కళాశాల వద్ద స్థలానికి చేరుకుని బాధితులతో కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 20 ఏళ్ల కిందట ఏక్సాల్ పట్టా ఇచ్చిన భూములను కళాశాల కోసం తీసుకున్నారని అయితే బాధితులకు తిరిగీ ఎలాంటి భూమి గాని ఇంటి స్థలాలు గాని కేటాయించకపోవడంతో తాము లాకాయుక్తను ఆశ్రయించామని బాధితులు ఆర్డీఓకు వివరించారు. దీంతో బాధితులు తమ వద్ద ఉన్న పూర్తి ఆధారాలను ఆయనకు అందజేసి న్యాయం చేయాలని కోరారు. సంబంధిత అధికారులతో చర్చించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్వతి, సర్వేయర్‌లు, వీఆర్‌ఓలు సిబ్బంది ఉన్నారు.

మొగిలి ఘాట్‌లో కంటైనర్ బోల్తా

బంగారుపాళెం : మండలంలోని మొగిలి ఘాట్ చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై బుధవారం కంటైనర్ బోల్తా పడింది.ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరు నుంచి చెన్నై వెళుతున్న కంటైనర్ వాహనం మొగిలి ఘాట్‌లో అదుపు తప్పి జాతీయ రహదారి పక్కన బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తరచూ మొగిలి ఘాట్‌లో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

కంటైనర్‌కు మంటలు..

మండలంలోని మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద మంగళవారం రాత్రి ఓ కంటైనర్ వాహనానికి మంటలు చెలరేగాయి. అనంతపురం జిల్లా పెనుగొండ నుంచి చెన్నైకి వెళుతున్న కంటైనర్ టోల్‌ప్లాజా సమీపంలో రహదారి పక్కన పార్కు చేసి ఉండగా హఠాత్తుగా వాహనం కుడివైపు వెనుక గల టైర్లు వద్ద మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న టోల్‌ప్లాజా సిబ్బంది, ఇతర వాహనదారులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. సమాచారాన్ని పోలీసులు, ఫైర్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని పోలీసులు తెలిపారు.



మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద అగ్ని ప్రమాదానికి గురైన కంటైనర్

రోగుల వద్ద డబ్బులు వసూలు చేస్తే చర్యలు

- ఆరోగ్యమిత్రలు రోగులకు సహకారం అందించాలి
- మెరుగైన వైద్య సేవలకు చర్యలు చేపట్టాలి
- సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల వద్ద డబ్బు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో డా.ఎన్‌టీఆర్ వైద్య సేవకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించకున్నా, డబ్బులు వసూలు చేసినా చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. ఆసుపత్రుల్లోని ఆరోగ్యమిత్రలు రోగులకు అవసరమైన సేవలు, సలహాలు అందించడంలో బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలోని నెట్వర్క్ ఆసుపత్రులకు సంబంధించి అందిన 31 ఫిర్యాదులను కలెక్టర్ పరిశీలించి చర్చించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం

తిరుపతి సిటీ : కోల్‌కత్తా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ బుధవారం విడుదల చేసిన ఫలితాల్ల తిరుపతి ఎల్‌ఐసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ విద్యార్థులు సత్తా చాటినట్ల సంస్థ డైరెక్టర్లు ఇ.గిరిధర్, కె.విశ్వనాథ్ తెలిపారు. ఈ ఫలితాలకు సంబంధించి ఇంటర్‌లో 61.34 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. పి.నికిత్ 476, ఎస్.సౌమ్య 432, ఆర్.గణేష్ 430, పి.కుసుమ 420, ఎం.సాయి తేజ 405, కె.కీర్తి 400, కె.ద్వారకనాథరెడ్డి 400, హర్షిత 400 మార్కులు సాధించినట్లు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో కళాశాల డైరెక్టర్లు

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని డా.బీఆర్. అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీసీఓ గీత తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు మార్చి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఏప్రిల్ 6వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఏవైనా సందేహాలకు చిత్తూరు 97045 50109, జీడీ నెల్లూరు 99892 11885, పలమనేరు 94933 71732, కుప్పం 99598 88586, రామకుప్పం 97045 50107, పూతలపట్టు 70327 03758, విజలాపురం 96667 27126 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

భూ రీసర్వే పారదర్శకంగా చేపట్టాలి



రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ

తవణంపల్లె : భూరీసర్వే పారదర్శకంగా చేపట్టాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలో భూరీసర్వే పైలట్ గ్రామంగా ఎంపికైన చెర్లోపల్లెలో జరుగుతున్న రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి రైతు రికార్డులను పరిశీలించి సర్వే చేయాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీతో పాటు చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను యుద్ధ ప్రాతిపదికన పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, భూరీ సర్వే డీటీ వెంకటరమణ, ఆర్‌ఐ జీవన్‌కుమార్, మండల సర్వేయర్ మురళీకృష్ణ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆటోమెటిక్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్



నిర్మాణంలో ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : బంగారుపాళ్యం మండలం పాపనివారిపల్లి క్రాస్‌లో ఆటోమెటిక్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారులు తెలిపారు. ఇకపై ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ తరహాలోనే ఈ వెహికల్ ఆటోమెటిక్ ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్ పనిచేస్తుందన్నారు. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. త్వరలో ప్రారంభోత్సవం జరగనుందని అధికారులు పేర్కొన్నారు.

నేడు కుప్పంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కుప్పం ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 13వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కుప్పం నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

పురిటిబిడ్డ మృతి కేసులో ఆరుగురి అరెస్టు

చిత్తూరు అర్బన్ : పురిటి బిడ్డ మృతి చెందిన కేసులో పోలీసులు ఆరుగురిని బుధవారం టూ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య వివరాల మేరకు తమిళనాడు రాష్ట్రం కాట్పాడికి చెందిన గుణసుందరి, సుమతి అక్కాచెల్లెలు. వీరిలో గుణసుందరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమె భర్త రిటైర్డు ఆర్మీ ఉద్యోగిగా ఉంటూ ఇటీవల మృతి చెందగా అప్పటికే గుణసుందరి నిండు గర్భిణిగా ఉండటంతో పోషించడం కష్టమని భావించి వదలించుకోవాలనే ప్రయత్నం చేసింది. ఈ నేపథ్యంలో తనకు పరిచయస్తురాలైన నళినికి విషయాన్ని తెలియజేసింది. నళిని చిత్తూరు సంతపేటకు చెందిన అఖిల అనే మహిళకు సమాచారాన్ని చేరవేసింది. ఈనెల 10వ తేదీన గుణసుందరి, సుమతి సంతపేటలోని నళిని ఇంటికి చేరుకున్నారు. గుణసుందరికి అఖిల తనకున్న అవగాహనతో తన ఇంటిలోనే ప్రసవం చేసింది. ఈ క్రమంలో మగబిడ్డ జన్మించాడు. అయితే శిశువు ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఎలాగైన బిడ్డను అమ్మేస్తే ఒక పని అయిపోతుందని ప్రయత్నాలు చేసింది. ఇందులో భాగంగా అఖిల స్నేహితురాలైన చంద్రకళకు బిడ్డలు లేకపోవడంతో ఈ విషయాన్ని తెలియజేసింది. అయితే తనకు అవసరం లేదని తెలిపింది. ఈక్రమంలో చంద్రకళకు బస్సులో పరిచయమైన తిరుపతికి చెందిన సుజాతకు బిడ్డలు లేని విషయాన్ని గుర్తించి చంద్రకళ ఆమెకు జరిగిన విషయాన్ని ఫోన్ ద్వారా చెప్పింది. అదే రోజు రాత్రి సుజాత.. చంద్రకళను కలిసింది. అప్పటికే బిడ్డ నోట్లో నురగ వస్తుండటంతో భయపడి చిత్తూరులోని రెండు ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించారు. అక్కడి డాక్టర్లు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో చంద్రకళ, సుజాత పసిబిడ్డను తీసుకుని ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. డాక్టర్లు బిడ్డ తల్లి ఎక్కడని అడగ్గా ఇంట్లో ప్రసవం జరగడంతో ఆమె రక్తస్రావం ఎక్కువైందని, అందువల్ల తీసుకురాలేదని అబద్దాలు చెప్పారు. 11వ తేదీన ఐసీయూలో పెట్టి చికిత్స అందిస్తుండగానే బిడ్డ మరణించిందని డాక్టర్లు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న చంద్రకళ అక్కడి నుంచి జారుకునే ప్రయత్నం చేసింది. డాక్టర్లు పోలీసులకు సమాచారం ఇవ్వగా...పోలీసులు విచారణ చేపట్టారు. పసిబిడ్డ మృతికి కారణమైన గుణసుందరి, సుమతి, నళిని, చంద్రకళ, అఖిల, గోపిలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆసుపత్రి సేవల పరిశీలన



ఆయుష్మాన్ మందిర్ జూమ్ మీటింగ్‌కు హాజరైన అధికారులు

గుడిపాల : గుడిపాల ప్రాథమిక ఆరోగ్య పరిధిలోని వసంతాపురం ఆరోగ్య మందిర్‌పై బుధవారం న్యూఢిల్లీ నుంచి ఆరోగ్యశాఖ ఎన్‌క్యూ ఏఎస్ అధికారులు వికాస్‌త్యాగి, జటిలేశ్వర్ డెబర్మా జూమ్ మీటింగ్ ద్వారా పరిశీలన చేశారు. ఎన్‌క్యూ ఏఎస్ విధానం మేరకు రోగికి అందుతున్న సేవలు, చికిత్స విధానం, వైద్య పరికరాలు, ఆరోగ్య పరిసరాలు, రోగులకు కల్పిస్తున్న వసతులపై తెలుసుకున్నారు.ఈ విధానంలో 70 శాతం సాధిస్తే ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ ద్వారా ఎన్‌క్యూ ఏఎస్ సర్టిఫికెట్ అందజేస్తారు. దీనిద్వారా కేంద్ర నిధులు ఆసుపత్రికి 75శాతం, సిబ్బంది మోటివేషన్‌కు 25 శాతం నిధులు మంజూరవుతాయి. జిల్లా ఆరోగ్యశాఖ క్వాలిటీ మేనేజర్ దివ్యదీప్తి, సర్పంచ్ రజినీకాంత్, ఎంపీటీసీ విజయలక్ష్మి, డాక్టర్ సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.